క్లుప్తంగా

సీఎంను కలిసిన నేతలు



సీఎంతో నర్సిములు

దౌల్తాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో యువజన కాంగ్రెస్ మండల నాయకుడు నర్సిములు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మండలంలోని సమస్యలను వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందేలా కృషి చేయాలని సీఎం సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

బంట్వారం: రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు ఎంపీడీఓ రాములు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లపై బ్యాంకర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెరిఫికేషన్ ప్రక్రియ 12వ తేదీ వరకు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే అర్హుల జాబితాను సిద్ధం చేసి ఈ నెల 20న డీఎల్‌సీకి పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, మర్పల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు తుమ్మల రమేష్, బీసీ వార్డెన్ ఉమేందర్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

పూడూరు: ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉన్నప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని అన్నారు. సోమేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సుభాన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారత్నం పాల్గొని 13 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్‌గౌడ్, రమేష్, అబ్బి సుందరయ్య, మండల మహిళా అధ్యక్షురాలు రాణి, అనసూయ, శ్రీనాథ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్పస్వామి కల్యాణం



ఎమ్మెల్యే శంకర్‌ను గొంగడితో సన్మానిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

కొత్తూరు: మండల పరిధిలోని ఎస్‌బీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు ఆలయ కమిటీ చైర్మన్ ఎమ్మె సత్యనారాయణ శాలువాలతో సన్మానించారు.

ఇక ఫైనల్ సర్వే!

- ఇందిరమ్మ కమిటీల జాబితాపై అధికారుల విచారణ
- పరిశీలన తర్వాత తుది జాబితా వెల్లడి
- లబ్ధిదారుల్లో చిగురించిన ఆశలు



నీటూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు

దౌల్తాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా వివరాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ విషయాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కమిటీ తయారు చేసిన ఇళ్ల జాబితాలో పేరున్న ప్రతి ఇంటికి అధికారులు వెళ్లాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రత్యేకంగా తయారు చేసిన పత్రంలో వివరాలతో తుది జాబితాను సిద్ధం చేస్తామని పేర్కొంటున్నారు.

మండలానికి 251 ఇళ్లు మంజూరు

దౌల్తాబాద్ మండలానికి 251 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. దరఖాస్తుల ఆధారంగా ఏ గ్రామానికి ఎన్ని ఇళ్లు కేటాయించాలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇందిరమ్మ కమిటీలు ప్రత్యేకంగా సమావేశమై ఇళ్ల లబ్ధిదారుల జాబితాను తయారు చేసి ఎంపీడీఓలకు అందించారు. ఈ జాబితా ఆధారంగా ఎంపీడీఓ, ఏఈలు, కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు.

ఆరా తీస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల జాబితాలతో ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. సమీపంలో ఉంటున్నవారిని సైతం వివరాలు అడుగుతున్నారు. ప్రస్తుతం నివాసముంటున్న వారి ఇంటి పైకప్పు ఎలా ఉంది. గోడలు ఏవిధంగా ఉన్నాయి. బీపీఎల్ కుటుంబానికి చెందినవారేనా అని జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. ఈ విచారణను త్వరలో పూర్తి చేసి గ్రామాల్లో ప్రదర్శిస్తామని అన్నారు. తదుపరి జిల్లా కలెక్టరు ఆమోదంతో లబ్ధిదారుల పేర్లతో ప్రొసీడింగ్‌లు జారీ చేస్తారని అధికారులు తెలిపారు. కాగా ఇళ్లు లేని నిరుపేదలకు మొదటి విడతలో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **విచారణ చేపడుతున్నాం**
>
> ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ఆధారంగా మండల అధికారుల బృందం గ్రామాల్లో విచారణ చేస్తున్నారు. జాబితాల్లో పేర్లు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం.
>
> – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

పట్టా భూమిలో రోడ్డు వేయొద్దని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: దళితుల భూమిలో రోడ్డు వేయడాన్ని నిలిపి వేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామానికి చెందిన ఇస్వప్ప, ప్రవీణ్‌కుమార్ అనే దళితుల పట్టా భూమిలో నుంచి అక్రమంగా రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పనులు ఆపాలన్నారు. రోడ్డు వేస్తున్న వ్యక్తులు బాధిత రైతుల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఎస్ఐ యాదయ్యగౌడ్‌కు వేర్వేరుగా వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య, దస్తయ్య, లక్ష్మయ్య, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు గుర్తింపు కార్డు

- యూనిక్ కోడ్‌తో ఐడీలు
- ఆధార్, పాస్‌బుక్, మొబైల్ నంబర్లతో లింక్



చల్లాపూర్ క్లస్టర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీని ప్రారంభిస్తున్న ఏఓ తదితరులు

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు ఐడీ ప్రాజెక్టు అమలులో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని ఏఓ లావణ్య తెలిపారు. ప్రతి రైతు నుంచి వివరాలు సేకరించి రైతులందరికీ ప్రత్యేక డిజిటల్ కార్డులను జారీ చేస్తామన్నారు. ఇందుకోసం మండలంలో ప్రతి క్లస్టర్ పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభించినట్లు ఏఓ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలకు ఈ కార్డు ప్రామాణికం కానుందని పేర్కొన్నారు.

ఆధార్ తరహాలో..

రైతులకు సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలకు ఫార్మర్ ఐడీ కీలకం కానుందని ఏఓ తెలిపారు. ఈ గుర్తింపు కార్డు సంఖ్య పొందడం సులువే. ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబరు వివరాలను ఏఈఓలు నమోదు చేసి 11 నంబర్లు గల ఫార్మర్ ఐడీ సంఖ్య ఇస్తారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకుని రైతులకు ఐడీ కార్డులు జారీ చేస్తారని ఏఓ వివరించారు.

రోడ్డుపై ఆటోలు.. వెళ్లాలంటే అవస్థలు



రోడ్డుపైనే ఆటోలు నిలపడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై సదాశివపేటకు వెళ్లే ఆటోలు నిలుపుతున్నారు. మరోవైపు ఈ రోడ్డుపైనే బస్సులు ఆగుతున్నాయి. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారిపై ఆటోలు నిలపడంతో ట్రాఫిక్ జాం అయి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం బస్టాండు సౌకర్యం లేకపోవడంతో మహిళలు, వృద్ధులు రోడ్డుపైనే నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆటోలను స్టాండులోనే నిలపాలని వాహనదారులు కోరుతున్నారు.

– మోమిన్‌పేట

కేంద్ర నిధులతోనే రేషన్ బియ్యం

బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్



రేషన్‌షాపు వద్ద మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో రేషన్ దుకాణాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తోందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్ అన్నారు. సోమవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ఉన్న రేషన్ దుకాణాలను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటంతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. అంత్యోదయ పథకం కింద రేషన్ దుకాణాల్లో ఒక్కో కుటుంబానికి వచ్చే 35 కిలోల బియ్యం పూర్తి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే కేంద్ర నిధులతో ఇచ్చే రేషన్ బియ్యాన్ని తామే ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందరికీ తెలిసేవిధంగా పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుందని, వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించార. కార్యక్రమంలో నాయకులు మురళీ, ప్యాట అశోక్, వంశీకృష్ణ, కుర్మయ్య, రుషికేష్, రాము, నర్సింహ, మధు, అంజి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బంట్వారం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించే వారికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం బంట్వారం మండల అధ్యక్షుడు సుబాష్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. ఈ క్రమంలో విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. అధికారులు స్పందించి సత్వరమే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు.

కులగణనతో బడుగులకు మేలు

దోమ: దేశ వ్యాప్తంగా జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోయిందని బీసీ సంక్షేమ సంఘం దోమ మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని తీసుకున్న నిర్ణయం యావత్ దేశ ప్రజలందరూ హర్షించదగ్గ విషయం అన్నారు. భారత దేశ ప్రజల అభివృద్ధి కోసం కులగణన శ్రేయస్కరమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మారెమ్మ సేవాలాల్ ఉత్సవాలు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మూడు మామిళ్లతండా గ్రామపంచాయతీ డీప్లానాయక్‌తండాలో మంగళవారం నుంచి ఈ నెల 8 వరకు మారెమ్మ సేవాలాల్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తండా నాయకులు, నిర్వాహకులు జయరాం, చందర్, గోపాల్, సక్రియానాయక్ తదితరులు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

షాద్‌నగర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే సోమవారం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామంలోని దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈదురగాలులు, వడగళ్ల వర్షానికి గ్రామానికి చెందిన 8 మంది రైతులకు సంబంధించి సుమారు 20 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

షాద్‌నగర్ ఏడీఏ బదిలీ

షాద్‌నగర్: గత ఏడేళ్లుగా షాద్‌నగర్ వ్యవసాయ డివిజనల్ అధికారిగా(ఏడీఏ) విధులు నిర్వహిస్తున్న రాజారత్నంకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సోమవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నారాయణపేట అగ్రికల్చర్ టెక్నాలజీ(ఆత్మ) పీడీగా బదిలీపై వెళ్లారు. షాద్‌నగర్ ఏడీఏగా అధికారులు ఇంకా ఎవరినీ నియమించలేదు. కొత్త ఏడీఏ వచ్చేవరకు ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ అధికారి నిషాంత్ ఇన్‌చార్జిగా ఉండనున్నారు.

స్కూల్ యూనిఫామ్ నాణ్యంగా కుట్టాలి

కొందుర్గు: విద్యార్థుల స్కూల్ యూనిఫామ్ కుట్టడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లేడ్ చౌదరిగూడ ఏపీఎం నర్సింహ సూచించారు. సోమవారం ఎదిర క్లస్టర్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విద్యార్థుల యూనిఫామ్ కుట్టడాన్ని మహిళలకు అప్పగించిందన్నారు.

వేసవి శిబిరాలతో విద్యార్థులకు మేలు



సమ్మర్ క్యాంపు ర్యాలీలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోట్‌పల్లి ఎంఈఓ చంద్రప్ప అన్నారు. సోమవారం కోట్‌పల్లి, మోత్కుపల్లిలో ఆయన విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. సమ్మర్ క్యాంపులు కొనసాగుతాయన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు హాజరు కావాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు క్యాంపు పని వేళలు ఉంటాయన్నారు. క్యాంపులో విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ ఇస్తారన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్, గేమ్స్, స్పోర్ట్స్, కరాటే, బాక్సింగ్, డ్యాన్స్, సాంగ్స్, మ్యూజిక్, స్టోరీ టెల్లింగ్, స్కిట్స్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అరుణ్‌కుమార్, సీఆర్‌పీ నర్సింలు, క్యాంపు నిర్వాహకులు శ్రీనివాస్, గోపాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

పరిగి: పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు సంతోషంగా గడిపారు. చిన్ననాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. 22 ఏళ్ల తరువాత ఒకే దగ్గర కలుసుకుని తమ సాధకబాధకలను పంచుకున్నారు. అనంతరం గురువులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దోమ: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ గ్యామాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఆయా గ్రామాలలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు డబ్బులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అసలే వేసవికాలం అందులో ఎండలు దంచి కొడుతున్న నేపథ్యంలో కూలీలు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. నెలల తరబడి డబ్బులు రాకపోవడంతో కుటుంబాలు గడవలేని పరిస్థితులు నెలకొంటున్నాయని వాపోయారు. ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రూ.307 ఉంటే కొలతల పేరుతో వేతనాలలో కోత విధించి రూ.100 నుంచి రూ.150 మాత్రమే అధికారులు వేస్తున్నారని ఆరోపించారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రతి కూలీకి రూ.307 చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తయ్య, మొగులయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలకు చెక్

- ఆర్డీఓ చంద్రకళ
- కార్యాలయాల చుట్టూ తిరగకుండా త్వరితగతిన పరిష్కారం



రైతు మోహన్‌రెడ్డికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

చేవెళ్ల: భూ భారతితో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు ఇక తీరినట్లేనని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం భూభారతి ద్వారా ఓ రైతు ఏళ్లనాటి కోర్టు సమస్యకు పరిష్కారం చూపించి పట్టా పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసిన కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భూభారతి రైతుల పాలిట వరంలాంటిన్నారు. ఇకపై భూ సమస్యలు ఉండవన్నారు. కేతిరెడ్డిపల్లి రైతు మోహన్‌రెడ్డి కోర్టులో ఉన్న భూ సమస్య పరిష్కారమవడమే దీనికి నిదర్శనం అన్నారు. మండలంలోని కేతిరెడ్డిపల్లికి చెందిన మోహన్‌రెడ్డికి అదే గ్రామంలోని సర్వే నెంబర్ 399, 397లలో ఒక ఎకరం 12 గుంటల భూమి ఉంది. ఈ భూమి మీద తన భార్య కోర్టులో కేసు వేసింది. కోర్టులో మోహన్‌రెడ్డికి తీర్పు అనుకూలంగా వచ్చింది. కాని దీనికి సంబంధించి ఆయనకు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి పాస్‌పుస్తకం ఇవ్వలేకపోయారు. దీంతో ఆయన గత ఏడాది కాలంగా సమస్య పరిష్కారం కోసం కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నట్లు తెలిపారు. దీనిపై భూభారతిలో ఆయన సమస్యను పరిష్కరించామన్నారు. సమస్యలను పరిష్కరించటంతో పాటు సోమవారం ఆయనను పిలిచి పాస్‌పుస్తకం కోసం అప్రూవ్ చేసినట్లుగా ఓ కాపీని అందజేసినట్లు తెలిపారు. రైతులు ఎవరూ భూ సమస్యలు పరిష్కారం కావటం లేదని ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. ఈ సందర్భంగా రైతు మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశాడు.

క్రీడలతో మానసికోల్లాసం

మొయినాబాద్‌రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసం, శరీర దృఢత్వానికి ఎంతో దోహద పడతాయని రైతు సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల చెన్నారెడ్డి అన్నారు. సోమవారం అజీజ్‌నగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ పట్లోళ్ల వెంకట్‌రెడ్డి సోదరుడు మల్లారెడ్డి జ్ఞాపకార్థంగా జిల్లాస్థాయి పీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ స్వర్గీయ వెంకట్‌రెడ్డి కుమారుడు చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఆయా గ్రామాల నుంచి 15 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. అజీజ్‌నగర్ సమీపంలోని క్రికెట్ గ్రౌండ్‌లో టోర్నమెంట్‌ను పట్లోళ్ల చెన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించినప్పుడే సమాజంలో గుర్తింపు పొందుతారన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకొని కలిసిమెలసి ఆడాలని సూచించారు.

నిర్మాణం పూర్తికాక.. ఇబ్బందులు తీరక

మండల పరిధిలోని ఏర్పుమళ్ల ఎస్సీ అంగన్‌వాడీ భవన నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. సొంత భవనం లేక మూడు దశాబ్దాలుగా అవస్థలు పడుతున్నామని తల్లిదండ్రులు, చిన్నారులు, అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని వాపోతున్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– బొంరాస్‌పేట



అసంపూర్తి నిర్మాణంలో అంగన్‌వాడీ భవనం